బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి



రాజేందర్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్‌లోని అంబేడ్కర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్‌గా టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పర్వతాల రాజేందర్ ఆదివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జంగమ్మెట్ డివిజన్‌లోని బస్తీలలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. అంబేడ్కర్ నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.బాబురావు, ముఖ్య సలహాదారుడు బి.విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వర్ తనను చీఫ్ ప్యాట్రన్‌గా ఎన్నుకోవడం సంతోషకరమన్నారు.

హరిజన సేవక్ మండలి ఎన్నికలు నిర్వహించండి



జ్ఞానేశ్వర్

అబిడ్స్: చుడిబజార్ లోని హరిజన సేవక్ మండలి (అరుంధతి సేవక్ మండలి) ఎన్నికలను వెంటనే నిర్వహించాలని హరిజన సేవక్ మండలి మాజీ అధ్యక్షుడు వీజీ.జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు. ప్రస్తుత కమిటీ కాల పరిమితి ముగిసి నాలుగు నెలలు కావస్తున్నా ఎందుకు ఎన్నికలు నిర్వహించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆదివారం వీజీ జ్ఞానేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికలను కమిటీ కాలపరిమితి ముగిసిన వెంటనే నిర్వహిస్తే ప్రజలకే ఎంతో మేలు జరుగుతుందన్నారు. చట్ట ప్రకారం త్వరలోనే ఎన్నికలు నిర్వహించి ఎన్నికల్లో గెలిచిన నూతన కమిటీ సేవక్ మండలి అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు. వెంటనే ఎన్నికలు నిర్వహించే విధగా అందరూ కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించకపోవడంతో అందరూ అసంతృప్తిగా ఉన్నారన్నారు.

వృద్ధుడి అదృశ్యం



రాజు పన్నాలాల్ టక్

గౌలిపురా: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..మహారాష్ట్రకు చెందిన రాజు పన్నాలాల్ టక్ (70) దంపతులు ఈ నెల 14న సుల్తాన్‌షాహీ వాల్మీకినగర్‌లో నివాసముండే మనువడు ఆకాశ్ టక్ కూతురు జన్మదిన వేడుకల కోసం వచ్చారు. కాగా ఈ నెల 19న పన్నాలాల్ టక్ ఇంట్లో కుటుంబసభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన మనువడు ఆకాశ్ స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకుండా పోయింది. దీంతో తన తాత కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేరిణి నృత్యంలో సాత్విక ప్రతిభ

అఫ్జల్‌గంజ్: పేరిణి నృత్యంతో విద్యార్థిని సాత్విక అందరిని అలరించింది. నారాయణగూడ కేశవ మెమోరియల్ ఇంజినీరింగ్ విద్యార్థిని సాత్విక పేరిణి నృత్యంలో విశేష ప్రతిభ కనబరిచింది. తెలంగాణ పోలీస్ అకాడమిలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పేరిణికి సంబంధించిన పలు నృత్యాలు చేస్తూ అందరిని ఆకట్టుకుంది. గురువు పేరిణి ప్రకాష్ వద్ద ఆమె నృత్యాలను నేర్చుకుంటుంది. ఈ సందర్భంగా కళాకారిణి సాత్విక మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా విశేష ప్రతిభ కనబరుస్తానని పేర్కొన్నారు. తన గురువు పేరిణి ప్రకాష్ సహకారంతో రాణిస్తున్నట్లు వెల్లడించారు.



వచ్చేదెప్పుడో..పోయేదెప్పుడో..?

- సమయపాలన పాటించని ఎంఎంటీఎస్ రైళ్లు
- ఇక్కట్లకు గురవుతున్న ప్రయాణికులు
- రైళ్ల సంఖ్య పెంచాలంటూ డిమాండ్



ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌లో ఎంఎంటీఎస్ వద్ద ప్రయాణికులు

చార్మినార్: పాతబస్తీ నుంచి నగరంలోని ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి ఎంఎంటీఎస్ రైల్లు ఎంతో ఉపయోగంగా ఉన్నాయి. సాధారణంగా యాకుత్‌పురా, డబీర్‌పురా నుంచి సికింద్రాబాద్ వెళ్లేందుకు రెండు మూడు ఆర్టీసీ బస్సులను మారడంతో పాటు సమయం వృథా అవుతుంది. ఇక ఎంఎంటీఎస్ ట్రైనైతే.. సమయం ఆదాతో పాటు రేటు కూడా తక్కువగా ఉంటుంది. అందుకే పాతబస్తీలోని ప్రయాణికులు ఎంఎంటీఎస్ ట్రైన్‌లపై ఆధారపడి ప్రతిరోజూ విరివిగా వినియోగిస్తున్నారు. అయితే పాతబస్తీలో నడిచే ఎంఎంటీఎస్ రైళ్ల సమయ పాలన పాటించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. పాతబస్తీ పరిధిలోని ఫలక్‌నుమా, ఉప్పుగూడ, యాకుత్‌పురా, డబీర్‌పురా, మలక్‌పేట తదితర రైల్వేస్టేషన్ల పరిధిలో నిత్యం వేలాది మంది రైళ్లలో రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం వేళల్లో మాత్రమే సమయానికి వచ్చే రైళ్లు తదనంతరం సమయ పాలన పాటించడం లేదు. దీంతో దీనిపైనే ఆధారపడిన ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు.

సాయంత్రం వేళలో ట్రిప్పుల సంఖ్య పెంచాలి..

సాయంత్రం సమయంలో ఈ సమస్య మరీ తీవ్రంగా మారింది. దీంతో ఉద్యోగాలు, విద్యార్థులు రైలులో ప్రయాణించలేక నరకం అనుభవిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల అనంతరం ఏ రైలు ఎప్పుడొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. దాదాపు గంట పాటు ఆలస్యంగా రైళ్లు నడుస్తుండడం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. నాలుగు గంటల అనంతరం గంటకొకటి చొప్పున రైళ్లు నడుస్తుండడం.. అవి కూడా ఆలస్యం కావడంతో ఆరు గంటలకు వచ్చే రైలుపై ఆధారపడ్డ ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. 4 నుంచి 6 గంటల వరకు రైళ్ల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికుల సంఖ్య అధికం కావడంతో ఆ సమయంలో వచ్చిన రైలునే ఎక్కడంతో ఇసుక వేస్తే రాలనంతగా పరిస్థితి తయారవుతోంది. మహిళలు, వృద్ధులు, చిన్నారులు దిగాల్సిన స్టేషన్ వచ్చినప్పుడు దిగలేక ప్రమాదాలకు గురవుతున్నారు. సాయంత్రం వేళ రైళ్ల సంఖ్యను రెట్టింపు చేసి నిర్దేశిత సమయాల్లో నడిచేటట్లు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైల్వే ప్రయాణికులు కోరుతున్నారు.

రైల్వే స్టేషన్ల వద్ద నుంచి బస్సు సౌకర్యం కల్పించాలి..

పాతబస్తీలోని రైల్వే స్టేషన్ల వద్ద నుంచి తమ తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు అనుసంధానంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. కేవలం మలక్‌పేట్ రైల్వే స్టేషన్ వద్ద నుంచి మాత్రమే ఆర్టీసీ బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి తప్పా.. డబీర్‌పురా, యాకుత్‌పురా, ఉప్పుగూడ తదితర పాతబస్తీలోని మూడు రైల్వే స్టేషన్ల వద్ద నుంచి ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేవు. దీంతో స్థానికులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఎంఎంటీఎస్ రైళ్లకు అనుసంధానంగా ఆర్టీసీ బస్సులను అందుబాటులోకి తెస్తామని సంబంధిత అధికారులు ప్రకటించినప్పటికీ.. ఏళ్లు గడుస్తున్నప్పటికీ అవి ఇప్పటికీ అమలు కావడం లేదు. ఇప్పటికైనా పాతబస్తీలోని రైల్వే స్టేషన్ల వద్ద నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీరభద్రుడు తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఎంఎస్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మలిశెట్టి సీతారామ్ స్మారక వార్షిక సాహితీ పురస్కార మహోత్సవ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు జబ్బారి వేణుకి మలిశెట్టి సీతారామ్ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం విశ్రాంత ఐఏఎస్ అధికారి చిన వీరభద్రుడు మాట్లాడుతూ..ప్రపంచ సాహిత్యం నేడు మనకు అందుబాటులో ఉందని తెలిపారు. ప్రజలు సినిమాల నుంచి ఏమీ కోరుకోవడం లేదు కానీ తొక్కిసలాడుతూ..సినిమాలకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఒక అంశంపై రాసేటపుడు నిజం మాత్రమే రాయాలని రచయితపై ఎలాంటి ప్రభావం ఉండకూడదని సూచించారు. అనంతరం కథాప్రపంచం, లోపల ఏదో కదులుతుననట్లు సాక్షాత్కారం నవల పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేష్ కార్తీక్ నాయక్, సాహితీ వేత్త తాడి ప్రకాష్, కవులు యాకూబ్, కేపీ అశోక్‌కుమార్, ఎంఎస్ఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు మలిశెటి శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురు నిరుపేద కుటుంబాలకు మంజూరైన షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారు ముందుగా మీ సేవా కేంద్రంలో సంప్రదించి అవసరమైన ధ్రువపత్రాలను జత చేయాలన్నారు. షాదీముబారక్ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు అమ్మాయికి చెందిన ఆధార్ కార్డు, వయస్సు ధ్రువపత్రాలతో పాటు బ్యాంకు ఖాతాను కూడా పొందుపరచాలన్నారు. సయ్యద్ అబ్బాస్ హుస్సేన్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



ఈఓ అన్నపూర్ణకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మధుసూదన్ యాదవ్

చార్మినార్: కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం ఈఓగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అన్నపూర్ణను భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఉపాధ్యక్షుడు మధుసూదన్ యాదవ్ ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ ఈఓగా విధులు కొనసాగిస్తున్న ఆమెకు దేవాదాయ శాఖ మల్లికార్జున స్వామి దేవస్థానం ఈఓగా బాధ్యతలు అప్పగించిందన్నారు. గతంలో బల్కంపేట ఎల్లమ్మ తల్లి ఆలయం, ఏలూరు లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానం ఈఓగా కూడా పని చేశారని మధుసూదన్ యాదవ్ తెలిపారు. నగరం నుంచి ప్రతిరోజూ మల్లికార్జున స్వామిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో వస్తున్న భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారన్నారు.

ముగిసిన చైత్ర చంద్రిక వర్క్‌షాప్



ఔత్సాహిక కళాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాట్య గురువు

సుల్తాన్‌బజార్: శాస్త్రీయ సంగీత నృత్యాలు, లలిత కళలు, భారతీయ సాంస్కృతిలో భాగమని రాష్ట్ర ఖజాన, లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర అన్నారు. శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో నవ్య నాటక సమితి నిర్వహించిన మూడు రోజుల చైత్ర చంద్రిక అభినయ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జి.వసుంధర హాజరై ఔత్సాహిక కళాకారులకు వర్క్‌షాప్‌లో శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యువ కళాకారులందరూ మన సాంస్కృతిక రాయబారులన్నారు. అనేక మంది కళాకారులు ఉత్సాహ బరితంగా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహక సంస్థ పక్షాన నాట్య గురువు స్వప్న సుందరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇందిరా హేమ, లక్ష్మీమానస, మాధవి మాల, విజయ్‌కుమార్, బాలాజీ, కృష్ణ కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గోల్కొండ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చునని సంతోష్‌నగర్ పార్కు మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు ఈశ్వర్ జోషి తెలిపారు. ఆదివారం ఉదయం సంతోష్ నగర్ పార్కులో యోగాసనాలు చేశారు. ఆయన మాట్లాడుతూ..వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని అన్నారు. క్రమం తప్పకుండా యోగా చేసే వారు రోగాలకు దూరంగా ఉండగలుగుతారన్నారు.

మమతా గుప్తా సేవలు అభినందనీయం



మందుల పంపిణీ చేస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి, మమతా గుప్తా తదితరులు

అబిడ్స్: మాజీ కార్పొరేటర్, మమతా సంతోష్ గుప్తా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మమతా గుప్తా సేవలు అభినందనీయమని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం అబిడ్స్ నేతాజీ నగర్‌లో వైశ్య యూత్ అసోసియేషన్, మమతా సంతోష్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపును ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో మమతా సంతోష్‌గుప్తా కుటుంబం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. తరచు మమతా గుప్తా, సంతోష్‌గుప్తా పేద బడుగు వర్గాల కోసం పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజ సంక్షేమానికి, సమాజ అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ కుమార్, మాజీ చీఫ్ జస్టిస్ భాస్కర్‌రావ్, సంతోష్‌గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్న వారందరికీ ఉచితంగా మందులు అందజేశారు.



చిన్నారులతో నాట్య గురువు వేదాంతం రాధేశ్యామ్ తదితరులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సౌజన్యంతో పంచమ వేద నాట్య నిలయం 23వ వార్షికోత్సవాన్ని ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య గురువు ఆర్.కనకదుర్గ శిష్యబృందం వివిధ అంశాలపై ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ నాట్య గురువు వేదాంతం రాధేశ్యామ్ ముఖ్యఅతిథిగా హాజరై కళాకరులు, చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, విశ్రాంత ఆచార్యులు ఆర్.ప్రసన్న రాణి, యువ కళావాహిణి అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ, విశ్రాంత భరతనాట్యం అధ్యాపకురాలు మంజులరాణి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు తరలించండి



చెత్త సేకరణకు వచ్చిన ఆటో

శాలిబండ: జహనుమాన్ ఏరియాలోని బాయ్స్‌టౌన్ స్కూల్, మోడ్రన్ కాలనీలలో చెత్త సేకరణ వాహనం వారానికి రెండు సార్లు కూడా రాకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చెత్త సేకరణ ఆలస్యం కావడంతో ప్రజలు చెత్తాచెదారాన్ని వేయడానికి స్థలం లేకుండా పోయింది. దీంతో ప్రజలు ఆరోగ్య సమస్యలు, దుర్వాసన, దోమల సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అద్దంకి, అంజన్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎడ్ల పండరీనాథ్

చాంద్రాయణగుట్ట: ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్, లలితాబాగ్ డివిజన్ అధ్యక్షుడు మధుసూదన్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మెప్పు పొందాలన్న ఆత్రుతలో ఇష్టానుసారంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. వీరిపై టీపీసీసీ వెంటనే చర్యలు తీసుకోవాలని, మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే గాంధీ భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు రాజ్‌కుమార్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సండే..సందడి



చార్‌కమాన్-చార్మినార్ రోడ్డులో సందర్శకుల రద్దీ

చార్మినార్: సాధారణ రోజుల కన్నా.. సెలవు రోజుల్లో పాతబస్తీలో సందర్శకులు సందడి చేస్తున్నారు. ఇక వీకెండ్ అయిన ఆదివారం చార్మినార్ తదితర పర్యాటక ప్రాంతాలన్నీ పర్యాటకులతో కళకళలాడాయి. కుటుంబసభ్యులతో కలిసి చార్మినార్ సందర్శనకు రావడంతో ఆదివారం పరిసరాలన్నీ సందర్శకులతో కిక్కిరిసిపోయాయి. చిరువ్యాపారాలు జోరుగా కొనసాగాయి. గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. చార్మినార్ కట్టడంతో పాటు మక్కా మసీదు,లాడ్‌బజార్, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం తదితర పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో కళకళలాడాయి.

కోట కిటకిట..



గోల్కొండ కోటలో పర్యాటకులు

గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోటకు ఆదివారం పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. ఎండను సైతం లెక్క చేయక పర్యాటకులు టికెట్ కౌంటర్ ముందు బారులుతీరారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు కోటలోని ఆయుధాగారం, రాణి మహల్, అక్కన్నమాదన్న కార్యాలయాలను ఎంతో ఆసక్తిగా తిలకించారు.

షీ టాయిలెట్స్.. నో మెయింటనెన్స్



గోల్కొండ కోట ఎదురుగా ఉన్న షీ టాయిలెట్స్

గోల్కొండ: షీ టాయిలెట్స్‌ల నిర్వహణ బల్దియా వారు గాలికి వదిలేశారు. పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోట వద్ద రెండేళ్ల క్రితం స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా ఓ స్వచ్ఛంద సంస్థ వారు మహిళల కోసం షీ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. అయితే నెల రోజుల పాటు షీ టాయిలెట్స్ నిర్వహణ సవ్యంగానే సాగింది. కోటకు వచ్చే మహిళా పర్యాటకులు టాయిలెట్ ఎంతో ఉపయోగకరంగా ఉండింది. అయితే ఘనత వహించిన బల్దియా వారు మాత్రం పూర్తిగా గాలికి వదిలేశారు. ప్రస్తుతం టాయిలెట్ డోర్ పనిచేయకపోవడంతో పాటు దీనికి నీటి సరఫరా కూడా జరగడం లేదు. టాయిలెట్ మూలనపడడంతో టాయిలెట్ వెనుక ఉన్న సందులో పురుషులు మూత్ర విసర్జన చేస్తున్నారు.

అక్రమ పార్కింగ్‌లతో అవస్థలు

- తూతూ మంత్రంగా ట్రాఫిక్ పోలీసుల చర్యలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



పాత ముంబాయి జాతీయ రహదారిపై అక్రమ పార్కింగ్

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లకు అడ్డూ అదుపు లేకుండాపోతుంది. ప్రధాన రహదారుల పొడవునా వివిధ రకాల వాహనాలు గంటల తరబడి అక్రమంగా పార్కు చేసి ఉంటున్నాయి. పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను కూడా అక్రమ పార్కింగ్ కోసం వాడేసుకుంటున్నారు. టూంబ్స్ రోడ్డులోని ఫోర్డ్ సర్వీస్ వారు ఫుట్‌పాత్‌లను తమ సిబ్బంది వాహనాల పార్కింగ్‌కు వాడుకుంటుండగా పాత ముంబాయి జాతీయ రహదారిపై ఉన్న ఓ బడా కారు షోరూమ్ వారు తమ సిబ్బంది ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం ఫుట్‌పాత్‌నే ఎంచుకున్నారు. రెస్టారెంట్లు, మాల్స్ వారు తమ వినియోగదారుల వాహనాల పార్కింగ్‌ను కూడా పట్టించుకోవడం లేదు. పలు మాల్స్, షోరూమ్‌లు నిర్వహిస్తున్న భవనాలలో పార్కింగ్ సౌకర్యమే లేదు. రెస్టారెంట్ల వారు దర్జాగా రోడ్లపైనే పార్కింగ్ అంటూ బోర్డులు పెట్టేసి అక్కడ సెక్యూరిటీ గార్డులను పెట్టి మరి పార్కింగ్ చేయిస్తున్నారు. మరికొన్ని చోట్ల నో పార్కింగ్ అంటూ ఫొటో పెట్టి అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డు రోడ్డుపై పార్కింగ్ చేయిస్తున్నారు. గుడిమల్కాపూర్, మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లో ఇరానీ హోటల్స్ వారు తమ కస్టమర్ల వాహనాలను రోడ్డు మీదే పార్కింగ్ చేయిస్తున్నారు. టోలిచౌకీ చౌరస్తాలోని రెస్టారెంట్ల వారు ఏ రకమైన వాహనాన్ని తమ రెస్టారెంటు ముందు నుంచి పోకుండా ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు రోడ్డును వాడుకుంటున్నారు.

ముందుకు వెళ్లలేని దుస్థితి..

గచ్చిబౌలి, షేక్‌పేట్ తదితర ప్రాంతాల నుంచి మెహిదీపట్నం వెళ్లే ఆర్టీసీ బస్సులు టోలిచౌకీ ఫ్లైఓవర్ మీద నుంచి కాకుండా కిందనుంచి వెళ్లాలి. అయితే అక్రమ పార్కింగ్‌లతో రోడ్డుపై ముందుకు సాగలేని ఆర్టీసీ బస్సులు గత్యంతరం లేక బస్టాప్ వద్ద కాక ఎక్కడో ఆగుతున్నాయి. మరికొంత మంది ఆర్టీసీ డ్రైవర్లు గత్యంతరం లేక ఫ్లైఓవర్ మీద నుంచే వెళ్తున్నారు. దీంతో టోలిచౌకీలో దిగాల్సిన ప్రయాణికులు ఎక్కడో అలహసనాత్ కాలనీ వద్ద దిగుతున్నారు. అక్రమ పార్కింగ్‌లను ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు షాపులు, మాల్స్, రెస్టారెంట్ల ముందు ఉన్న వాహనాలకు చాలన్ వేసే విధంగా కేసులు నమోదు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ పార్కింగ్ స్థలాలు...

- టోలిచౌకీ చౌరస్తా రుమాన్ హోటల్.
- టూంబ్స్ చౌరస్తా జీషాన్ హోటల్.
- బంజారి దర్వాజా జీషాన్ హోటల్.
- మెహిదీపట్నం హసన్ హోటల్.
- మెహిదీపట్నం రైతు బజార్.
- షేక్‌పేట్ డీమార్ట్.
- సాలర్‌జంగ్ కాలనీ షాగౌస్ హోటల్.
- టోలిచౌకీ పశ్చిమ మండలం ఆర్‌టీఏ కార్యాలయం.
- షేక్‌పేట్ పాస్‌పోర్టు సేవా కేంద్రం.